క్లుప్తంగా

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలో ఉన్న 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు చైర్మన్లు, డైరెక్టర్లుగా పనిచేస్తున్న వారి పదవీకాలం మరో ఏడాది పొడిగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో పాటు విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు రౌతు భాస్కరరెడ్డి, అవనాపు లక్ష్మణరావు, డి. వామనాచారి, శ్రీరామ్మూర్తి, అడారి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

విజయనగరం రూరల్: పట్టణ పరిధిలోని కస్పా ఉన్నత పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పీసీబీ పర్యావరణ ఇంజినీర్ టి. సుదర్శన్ మాట్లాడుతూ, భవిష్యత్ తరాలు ప్రకృతి విపత్తులకు గురికాకుండా ఉండాలంటే ప్లాస్టిక్ నియంత్రణ ఒకటే మార్గమని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు, సింగిల్ యూజ్ కవర్లను నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీసీబీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గుణుపూరుపేట విద్యార్థిని ప్రతిభ



యశోదను అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణకుమారి, తదితరులు

డెంకాడ: రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో గుణుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆవాల యశోద కాంస్య పతకం సాధించింది. శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో యశోద తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థిని యశోదను పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు గౌరీశంకరరావు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

తక్షణమే విధుల్లో చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం పూల్‌బాగ్: ఇటీవల ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందిన వారు తక్షణమే ఆయా స్కూల్స్‌లో విధుల్లో చేరాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. డీఈఓ కార్యాలయంలో ఎంఈఓలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఏ-1, 2 పరీక్షలకు సంబంధించి వాల్యుయేషన్ పూర్తిచేయాలన్నారు. సచివాలయాల్లో విద్యాశాఖకు సంబంధించి వచ్చే గ్రీవెన్స్‌ను అదేరోజు సాయంత్రంలోగా పరిష్కరించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. యూడైస్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు కె.వాసుదేవరావు, డి.తిరుపతినాయుడు, ఎంఈఓలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

గజపతినగరం: లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ డాక్టర్ బి.ఎస్.ఆర్.మూర్తి తనయుడు డాక్టర్ నాగనరేంద్ర వర్థంతి సందర్భంగా గజపతినగరం శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో లయన్స్ క్లబ్, చైతన్య భారతి ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్త దానం చేశారు. అలాగే విజయనగరం ప్రేమ సమాజం లో చిన్నారులకు భోజనాలు అందించారు. అలాగే 250 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాగనరేంద్ర భార్య లక్ష్మీ నరేన్, జెడ్పీటీసీ గార తవుడు, నాయకులు కర్లం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, గేదెల జగదీశ్వరరావు, వైద్యులు సతీష్ కుమార్, దుర్గాప్రసాద్, అనిల్ ప్రకాష్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తేలని లెక్క..

- అధికారికంగా తక్కువ... అనధికారికంగా ఎక్కువ
- పన్ను విధించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా స్పందించని యజమానులు
- కార్పొరేషన్ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి

విజయనగరం: కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో ఖాళీ స్థలాల లెక్క తేలడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం వీటి సంఖ్య తక్కువ చూపిస్తుండగా.... అనధికారంగా వేల సంఖ్యలో స్థలాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కార్పొరేషన్ యంత్రాంగం ఖాళీ స్థలాలకు పన్నులు విధించేందుకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌కు యజమానులు స్పందించకపోవడం గమనార్హం. దీంతో త్వరలో నగరంలో సర్వే నిర్వహించి పన్ను పరిధిలోకి రాని స్థలాలు గుర్తించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. కార్పొరేషన్ అధికారిక లెక్కల ప్రకారం నగరంలో 1645 ఖాళీ స్థలాల ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మరో 80 మంది స్థల యజమానులు ముందుకు వచ్చి ఆయా స్థలాలకు సంబంధించి పన్ను విధించాలంటూ దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో 40 పరిష్కారం కాగా.. మరో 40 వరకు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. ఇదిలా ఉండగా అధికారికంగా ఉన్న ఖాళీ స్థలాల ద్వారా రావాల్సిన పన్ను డిమాండ్ రూ.3.12 కోట్లు కాగా... ఇప్పటివరకు రూ.2.23 కోట్లు ఆదాయం వచ్చింది. మిగిలిన మొత్తాన్ని మార్చి 31లోగా వసూలు చేయాల్సి ఉంది.

ఖాళీ స్థలాలతో తప్పని కష్టాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలతో పరిసర ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వివిధ హోదాల్లో ఉన్న వారు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర పరిసరాల్లో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్న వాటిని ఏళ్ల తరబడి అలాగే ఖాళీగా వదిలేయడం పెద్ద సమస్యగా మారుతోంది. ఆ స్థలాలు మురుగునీటి ఆవాసాలుగా మారుతున్నారు. పందులు, పశువులకు నిలయంగా మారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారి, రోగాలు ప్రబలుతున్నాయి. ఓ వైపు పన్ను పరిధిలోకి రాకుండా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న యజమానులు, మరోవైపు ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు

చర్యలు తప్పవు..

నగరంలోని ఖాళీ స్థలాలకు సంబంధించి యజమానులు పన్ను విధించుకోవాలి. లేని పక్షంలో చర్యలు తప్పవు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 80 వరకు దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి నగరంలో పన్ను పరిధిలోకి రాని ఖాళీ స్థలాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటన్నింటినీ సచివాలయ కార్యదర్శుల ద్వారా గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం.

– పీవీడీ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

వైభవంగా కుంకుమ పూజలు



విజయనగరం: కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



విజయనగరం టౌన్: వజ్రకిరీటం, స్వర్ణవస్త్ర అలంకరణలో కన్యకపరమేశ్వరి

విజయనగరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమ్మవారి ఆలయంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 120 మంది మహిళలు పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సతీష్‌ను అమ్మవారి శేషవస్త్రంతో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు సత్కరించారు. అనంతరం పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి ఏవీఎస్ కుమార్, రీజనల్ సెక్రటరీ గుంపిన నారాయణరావు, కట్టమూరి రత్నారావు, వనిత – వాసవీ క్లబ్ సభ్యులు పెంటపాటి కుమారి, పేర్ల అమృతశ్రీ, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వేత్స సత్యనారాయణమూర్తి, పేర్ల సీతారామయ్య శెట్టి, విజ్జపు వెంకట శ్రీనివాసరావు, ఉపేంద్ర, మండవిల్లి వెంకటరాజు, ఆకిసూర్య ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మార్పణ దినోత్సవం..

విజయనగరం టౌన్: కన్యాకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు వజ్రకిరీటం, బంగారుచీరతో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో అన్నసమారాధనతో పాటు తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి, వైద్యసేవలందించారు.

కనులపండువగా కలశ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి దేవాలయాన్ని సందర్శిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం: మండలంలోని లింగాలవలసలో నూతనంగా నిర్మించిన శ్రీ కృష్ణ దేవాలయ మందిరంలో కలశ ప్రతిష్ఠ సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ముందుగా వేద పండితులు ఎమ్మెల్యే బడ్డుకొండ, జెడ్పీ చైర్మన్‌లను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, కేవీ సూర్యనారాయణరాజు (పులిరాజు), పడాల భానుప్రకాష్, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లిబోయిన నరసింగరావు, సుందర హరీష్, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, ఎరుబోతు పైడినాయుడు, కిలారి వెంకటరమణ, రిక్కా అప్పలనరసయ్య, కర్రోతు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలి



విజయనగరం టౌన్: నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు



విజయనగరం: చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు



నెల్లిమర్ల: నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామారావు తదితరులు

విజయనగరం: దేశ స్వాతంత్య్ర పోరాటంలో కీలక పాత్ర పోషించిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోష్ అని, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వంశీకుమార్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విజయనగరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125 జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వంశీకుమార్ మాట్లాడుతూ, సుభాష్ చంద్రబోస్‌కు జననం తప్ప మరణం లేదన్నారు. అజాద్ హింద్‌ఫౌజ్‌ని స్థాపించి యువతలో దేశభక్తిని నింపిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సాయికుమార్, మాధవ్, ధనుంజయ్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత నేతాజీ..

విజయనగరం టౌన్: అజాద్ హింద్ ఫౌజ్ అధినేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని శ్రీనివాసా ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బీ రామానాయుడు అన్నారు. బోస్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో నేతాజీ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు నేతాజీ వేషధారణలతో జైహింద్ అంటూ నినదించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మొయిద ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధైర్యానికి ప్రతిరూపం..

నెల్లిమర్ల: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధైర్యానికి, సాహసానికి ప్రతిరూపమని నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. నగరపంచాయతీ పరిధి జరజాపుపేట సచివాలయంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

విజయనగరం క్రైమ్: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని చాణక్య పబ్లిక్ స్కూల్‌లో రోడ్డు ప్రమాదాలు – నివారణ అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రోడ్డు సేఫ్టీ ఎన్‌జీఓ ప్రాంతీయ అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ కార్యదర్శి సైలాడ హరిబాబు, సభ్యులు కృష్ణారావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీఎస్సీ ఆప్టోమెట్రీ చదువుతున్న విద్యార్థులకు అగర్వాల్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టారు. కార్యక్రమంలో వీసీ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ రమణారావు, డీన్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ సీజ్

భోగాపురం: మండలంలోని తోటపల్లి బస్టాప్ వద్ద ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో రామచంద్రపేట ఉప్పుగెడ్డ నది నుంచి భోగాపురం వైపు ఇసుక లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ పట్టుబడింది. ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

నిత్యావసర సరుకుల అందజేత



సావిత్రమ్మ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని బీసీ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి విజయనగరం యూత్ ఫౌండేషన్ తమవంతు చేయూత నందించింది. 66 ఏళ్ల వయసు గల మానాపురం సావిత్రమ్మ పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారికి రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను సోమవారం అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న సావిత్రమ్మకు వస్తున్న పెన్షన్ డబ్బులతో అవసరమైన మందులు కొనుగోలు చేసుకుంటుండగా.... కొడుకు శ్రీను నరాల బలహీనతతో మంచానికి పరిమితమయ్యాడన్నారు. విషయం తమ దృష్టికి రావడంతో సహకారం అందించినట్లు తెలిపారు. అలాగే ఎస్.కోట మండలం ధర్మవరం ఎస్సీ కాలనీకి చెందిన ఆకేటి జానకమ్మకు సహాయం అందించామన్నారు. కార్యక్రమంలో జాప్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్లె సూరిబాబు, సంస్థ సభ్యులు అశోక్, సాయి, శరత్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం గొప్పది



పాఠశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

- నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం గొప్పదని, నగరంలోని పాఠశాలల భవన నిర్మాణాలకు రౌండ్ టేబుల్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఈ మేరకు 12వ డివిజన్ బుంగవీధిలో పాఠశాల భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలో అనేక ప్రాంతాలలో రౌండ్ టేబుల్ సంస్థ పాఠశాల భవన నిర్మాణాలను చేపట్టడం గొప్ప విషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం తద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం శుభసూచికమని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు – నేడు అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. రౌండ్‌టేబుల్ సంస్థ చైర్మన్ రవివర్మ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు అవసరమైన పాఠశాల భవన నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. 12వ డివిజన్ బూడివీధిలో 16 లక్షల రూపాయలతో రెండు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న మరో పాఠశాలను మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, తదితరులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల సూరిబాబు, బొంగ భానుమూర్తి, రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు సత్యదేవ్, వినీత్, అవినాష్, విరన్‌రెడ్డి, సతీష్, భావన, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



వ్యాసరచన పోటీలో విద్యార్థులు

డెంకాడ: నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా.. వ్యాసరచనలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డెంకాడ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్. జూషితమాధవి, పెదతాడివాడ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.సిరి నిలిచారు. వక్తృత్వ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలు గుణుపూరుపేట ఉన్నత పాఠశాలకు చెందిన డి.నందిని, సీహెచ్ హర్షిత సాధించారు. చిత్రలేఖనంలో పెదతాడివాడ ఉన్నత పాఠశాలకు చెందిన జి. నవదీప్, పినతాడివాడ ఎంపీయూపీ పాఠశాలకు చెందిన పి.అఖిల్ నిలిచారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా లక్ష్యాలను చేరుకోవాలి

- శతశాతం పన్నుల బకాయిలు వసూలు చేయాలి
- గడువులోగా 14,15వ ఆర్థిక సంఘాల నిధుల ఖర్చు
- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు ఆదేశించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి 43.40 కోట్ల రూపాయలు ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉండగా... ఇప్పటివరకు 22 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలు చేశామన్నారు. మార్చి నెలాఖరులోగా 21 కోట్ల రూపాయలు వసూలు లక్ష్యం కాగా.. సాధ్యమైనంత ఎక్కువ శాతాన్ని వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 24.80 కోట్ల రూపాయల పన్నును వసూలు చేశామన్నారు. మొండి బకాయిదారుల విషయంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

గడువులోగా ఖర్చు..

వివిధ అభివృద్ధి పనులకు కేంద్రం కేటాయించిన 14,15వ ఆర్థిక సంఘాల నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలు వేగవంతం చేయాలని కమిషనర్ శ్రీరాములనాయుడు సూచించారు. మార్చి 31లోగా నిధులు ఖర్చు చేయకుంటే వెనక్కి మళ్లిపోయే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ఆ రెండు పద్దుల కింద ఉన్న నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓ వైపు పనులు చేపడుతూనే మరోవైపు బిల్లులు ఆన్‌లైన్‌లో వెనువెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదనరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, సాయిప్రసాద్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కుమిలి కాలువ కల్వర్టుకు మోక్షం



కాలువ వద్ద డైవర్షన్ రోడ్ కోసం వేసిన మట్టి

నెల్లిమర్ల: నెల్లిమర్ల – రణస్థలం రహదారిలోనున్న కుమిలి కాలువపై కల్వర్టుకు మోక్షం లభించింది. శిథిలమైన కల్వర్టు స్థానంలో నూతన కల్వర్టును నిర్మించడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని కల్వర్టు వెడల్పు కూడా పెంచడానికి అధికారులు నిర్ణయించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. వివరాల్లోకి వెళితే.. నియోజకవర్గ కేంద్రమైన నెల్లిమర్ల నుంచి రణస్థలం వైపు వెళ్లే రహదారిలో స్థానిక సారిపల్లి జంక్షన్‌లో కుమిలి కాలువపై కల్వర్టు ఉంది. 2015లోనే ఈ కల్వర్టుకు రంధ్రం ఏర్పడింది. తాజాగా కల్వర్టుకు చెందిన పిట్ట గోడ కూలిపోయింది. ఓవైపు రంధ్రం, మరోవైపు కూలిన గోడతో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇదే విషయంపై సాక్షిలో తాజాగా కథనం ప్రచురితమైంది. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి ముందుకు వచ్చారు. అలాగే ఈ రహదారిని కూడా విస్తరించడానికి ప్రభుత్వం ఇప్పటికే ముందుకొచ్చిన విషయం తెలిసిందే. సుమారు ఐదున్నర మీటర్ల వెడల్పున్న రహదారిని రామతీర్థం వరకు పది మీటర్లు, అక్కడి నుంచి సతివాడ వరకు ఏడు మీటర్ల మేర విస్తరించనున్నారు. దీనిలో భాగంగా కుమిలి కల్వర్టును కూడా నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారు. ఈ రహదారిలో ప్రయాణించే వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని కల్వర్టు వెడల్పును పెంచనున్నారు. ప్రస్తుతం ఐదున్నర మీటర్ల వెడల్పున్న కల్వర్టును 12 నుంచి 15 మీటర్ల వెడల్పుతో నిర్మించడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలో కాలువలోకి నీటిని విడిచిపెట్టకుండా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. అలాగే రామతీర్థం గ్రామంలోని కల్వర్టు కంటే ముందుగా ఈ కల్వర్టు నిర్మించాలని సంబంధిత రహదారి నిర్మాణ కాంట్రాక్టర్‌కు సూచించారు. అంతేగాకుండా కల్వర్టు వద్ద మళ్లింపు రహదారి కోసం మట్టిని కూడా తాజాగా డంప్ చేశారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ నందకుమార్ సాక్షితో మాట్లాడుతూ, త్వరలోనే కుమిలి కాలువపై కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కల్వర్టు వెడల్పును 12 నుంచి 15 మీటర్లకు పెంచనున్నట్లు తెలిపారు. డైవర్షన్ రోడ్డు కోసం మట్టిని డంప్ చేశామన్నారు.